RNI.No. TELTEL/2010/32434

TELANGANA RISING 2047

# అన్వేష నేత్రం

ఎడిటర్ : గోళ్ల రమేష్

తెలుగు దినపత్రిక

సంపుటి :11 సంచిక : 344 | శుక్రవారం 27 మార్చి 2026 | హైదరాబాద్ | పేజీలు : 8 , రూ.1.00



## సీతారాముల వారికి పటు వస్త్రాలు సమర్పించనున్న సీఎం రేవంత్: మంత్రి తుమ్మల

శ్రీ రాముడు నడయాడిన భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి పెద్ద మనస్సుతో నిధులు మంజూరు చేశారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడించారు. మొదటి దశలో రూ.351 కోట్లతో చేపట్టే పనులకు తెలంగాణ సీఎం శంకుస్థాపన చేస్తారని తెలిపారు.మొత్తం రూ.586 కోట్లతో రామాలయంతో పాటు భద్రాచలం పట్టణాభివృద్ధిని మూడు దశల్లో అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు.

# బీఆర్ఎస్ చేసిన అప్పుల భారాన్ని ఇంకా మోస్తున్నాం

- పేదలకు అన్యాయం జరుగుతోందని విపక్షాలు అపోహలు సృష్టిస్తున్నాయి
- విద్యా, వైద్యం విషయంలో కోతలు ఉండవు
- కోతలు పెట్టాల్సి వస్తే వేరే కోతలు పెడతాం
- టీచింగ్ కాలేజీల నిర్వహణ గ్రూప్-1 అధికారులకు అప్పగిస్తాం
- ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించేందుకు కొత్త పథకం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకానికి రూ.600 కోట్లు బకాయిలు పెట్టి వెళ్తే తాము ప్రతినెలా రూ.89 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఇప్పటివరకు రూ.2,408 కోట్ల బిల్లులు చెల్లించామని అసెంబ్లీ సాక్షిగా తెలిపారు. ఏడో రోజైన నేడు(గురువారం) అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి.

2 లో..

## కాంగ్రెస్ కొత్తగా చేసిందేమీ లేదు..



### అసెంబ్లీలో మైక్ కట్ చేయడంపై ఎమ్మెల్యే హరీశ్ రావు ఆగ్రహం

రాష్ట్రంలో ఆరోగ్య రంగానికి సంబంధించిన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలపై ఎమ్మెల్యే హరీశ్ రావు ఘాటుగా స్పందించారు. అసెంబ్లీ వేదికగా తమ గళాన్ని వినిపించేందుకు ప్రయత్నించినప్పటికీ, మైక్ ఇవ్వకపోవడంపై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

వార్త 2లో



## ఘోర రోడ్డు ప్రమాదం.. స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి..

వార్త 2లో

### ఇంధన నిల్వలు ఉన్నాయి..

## ఆందోళన వద్దు: స్టీఫెన్ రవీంద్ర

రాష్ట్రంలో ఇంధన నిల్వలు ఉన్నాయని.. దీనిపై ఆందోళన అవసరం లేదని ప్రజలకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. బుధవారం 2,123 ట్యాంకర్స్ పెట్రోల్ సరఫరా చేశామన్నారు. అలాగే 10,799 లీటర్లు సరఫరా చేశారని వివరించారు. యావరేజ్‌గా 5,883 లీటర్ల పెట్రోల్ వినియోగం ఉంటే.. బుధవారం ఒక్క రోజే 84 శాతం అధికంగా పెట్రోల్ సరఫరా చేశారని చెప్పారు.



వార్త 2లో



## రాబోయే రోజుల్లో ప్రభుత్వాన్ని బీసీలే బొంద పెడుతారు: ఎమ్మెల్యే తలసాని

బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. బీసీల సంక్షేమానికి ప్రతి వార్షిక బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు ఖర్చు పెడతామని చెప్పి కాంగ్రెస్ నేతలు మోసం చేశారని ఆయన సోదాహరణగా వివరించారు.

వార్త 2లో




## ఇరాన్ టోల్ ఫీజు వసూలు చేస్తోందా.. హోర్ముజ్‌లో నౌకలు నగదు చెల్లిస్తున్నాయా..

వార్త 2లో

## ఇరాన్‌కు బిగ్ షాక్.. ఇజ్రాయెల్ దాడిలో నేవీ చీఫ్ మృతి!

అమెరికా-ఇజ్రాయెల్ తో జరుగుతున్న యుద్ధంలో ఇరాన్ కు మరో పెద్ద దెబ్బ తగిలింది. ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్ నేవీ చీఫ్ అలిరెజా తంగ్సిరీ మృతి చెందినట్లు తెలుస్తోంది. తమ దాడుల్లో ఇరాన్ నేవీ చీఫ్ మరణించినట్లు తాజాగా ఇజ్రాయెల్ తెలిపింది.ఇరాన్ శక్తివంతమైన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నౌకాదళ విభాగానికి నాయకత్వం వహించిన తంగ్సిరి, ఓడరేవు పట్టణమైన బందర్ అబ్బాస్‌లో జరిగిన దాడిలో మరణించినట్లు సమాచారం. హోర్ముజ్ జలసంధిని మూసివేయడాన్ని పర్యవేక్షించే బాధ్యత కమోడోర్ తంగ్సిరి నిర్వహిస్తున్నాడని ఇజ్రాయెల్ అధికారి తెలిపారు. అయితే, ఈ దాడి గురించి ఇరాన్ నుండి ఎలాంటి స్పందన రాలేదు.



## హైదరాబాద్ లో గ్యాస్ కొరత.. ఆటో నుంచి సిలిండర్లు ఎత్తుకెళ్లేందుకు యత్నం

పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్ లో వంట గ్యాస్ కొరత ఏర్పడింది. ఎల్ పిజి సిలిండర్ల కొరత లేదని కేంద్రం చెబుతున్నా.. సిలిండర్లు బుకింగ్ అయినా డెలివరీ కావడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గురువారం హైదరాబాద్ లో వంట గ్యాస్ సిలిండర్ల కొరత మరోసారి కనిపించింది. గ్యాస్ బుక్ చేసి చాలా రోజులు గడుస్తున్నా ఇంకా సిలిండర్ రాలేదని వినియోగదారుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలో గ్యాస్ ఆటో నుండి సిలిండర్లు ఎత్తుకెళ్లేందుకు వినియోగదారులు ప్రయత్నించారు. ఈ ఘటన ఫిలింనగర్ పరిధిలోని షేక్‌పేట్ లో చోటుచేసుకుంది. గ్యాస్



ఏజెన్సీ నుండి సిలిండర్లతో బయటికి వచ్చిన ఆటో నుండి అనుమతి లేకుండా కొందరు సిలిండర్లు ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో కొంతసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. వెంటనే ఏజెన్సీ సబ్బంది, స్థానికులతో కలిసి వారిని అడ్డుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

## మొయినాబాద్ డ్రగ్స్ కేసులో కొత్త ట్విస్ట్.. డాక్టర్‌ని అదుపులోకి తీసుకున్న సిట్

వార్త 2లో

# సీతారాముల వారికి పటు వస్త్రాలు సమర్పించనున్న సీఎం రేవంత్: మంత్రి తుమ్మల

భద్రాచలం, అన్వేషనేత్రం ప్రతినిధి

శ్రీ రాముడు నడయాడిన భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి పెద్ద మనస్సుతో నిధులు మంజూరు చేశారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మొదటి దశలో రూ.351 కోట్లతో చేపట్టే పనులకు తెలంగాణ సీఎం శంకుస్థాపన చేస్తారని తెలిపారు.మొత్తం రూ.586 కోట్లతో రామాలయంతో పాటు భద్రాచలం పట్టణాభివృద్ధిని మూడు దశల్లో అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలోని మిథిలా కళ్యాణ మండపం వేదికగా స్వామివారి కళ్యాణం జరుగుతుంది. అందుకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి తుమ్మల పరిశీలించారు.అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. శ్రీసీతారామచంద్రస్వామి దంపతులకు ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సీఎం రేవంత్ రెడ్డి సమర్పించనున్నారని తెలిపారు. అందుకు శుక్రవారం భద్రాచలానికి సీఎం రేవంత్ వస్తున్నారన్నారు. ఆయనకు ప్రజల తరపున ఘనంగా స్వాగతం పలుకుతామని చెప్పారు. భద్రాచలం వచ్చే భక్తుల సౌకర్యార్థం జాతీయ రహదారులు, రైల్వే కనెక్టివిటీ, ఎయిర్ పోర్టు ఏర్పాటు దిశగా అడుగులు వడివడిగా పడుతున్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యాక గోదావరిలో నావిగేషన్ సిస్టమ్ ఏర్పాటుకు అవకాశం ఉందని మంత్రి తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే పనులు చేపట్టినట్లు చెప్పారు. సీతారాముల కళ్యాణం వీక్షించే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై దేవాలయం అధికారులు, సిబ్బందికి మంత్రి తుమ్మల దిశా నిర్దేశం చేశారు.

# బీఆర్ఎస్ చేసిన అప్పుల భారాన్ని ఇంకా మోస్తున్నాం

- పేదలకు అన్యాయం జరుగుతోందని విపక్షాలు అపోహలు సృష్టిస్తున్నాయి
- విద్యా, వైద్యం విషయంలో కోతలు ఉండవు
- కోతలు పెట్టాల్సి వస్తే వేరే కోతలు పెడతాం
- టీచింగ్ కాలేజీల నిర్వహణ గ్రూప్-1 అధికారులకు అప్పగిస్తాం
- ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించేందుకు కొత్త పథకం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్: అన్వేషనేత్రం ప్రతినిధి

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకానికి రూ.600 కోట్లు బకాయిలు పెట్టి వెళ్తే తాము ప్రతినెలా రూ.89 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఇప్పటివరకు రూ.2,408 కోట్ల బిల్లులు చెల్లించామని అసెంబ్లీ సాక్షిగా తెలిపారు. ఏడో రోజైన నేడు(గురువారం) అసెంబ్లీ



సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సభలో సీఎం రేవంత్ ప్రసంగించారు. ఆరోగ్య శ్రీ కింద ప్రభుత్వాస్పత్రులకు రూ.927 కోట్లు, ప్రైవేట్ ఆస్పత్రులకు రూ.1,480 కోట్లు చెల్లించామని చెప్పుకొచ్చారు. 27 నెలల్లో పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు చెల్లించామని ఆయన వివరిం చారు. పేదలకు అన్యాయం జరుగుతోందని విపక్షాలు అపోహలు సృష్టిస్తున్నా యని.. బీఆర్ఎస్ గత ప్రభుత్వంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఎలా దుర్వినియోగం చేశారో అందరికీ తెలుసంటూ విమర్శించారు. ఎవరి పీఏలు సీఎం రిలీఫ్ ఫండ్ కాజేశారో కూడా తెలుసంటూ చురకలు అంటించారు రేవంత్. గత ప్రభుత్వంలో సీఎంఆర్ఎఫ్ నిధులను కొందరు తమ సొంత ఖాతాల్లో వేసుకున్నారని, దీనిపై విచారణ జరుగుతోందన్నారు. త్వరలోనే అన్నీ బయటకు వస్తాయని హెచ్చరించారు. తాము అధికారంలోకి వచ్చాక 27 నెలల్లో రూ.2,046 కోట్ల సీఎంఆర్ఎఫ్ కింద ఇచ్చామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అప్పుల భారాన్ని తమకు వారసత్వంగా ఇచ్చిందని, ఆ బకాయిలను తామే చెల్లిస్తున్నామని చెప్పారు రేవంత్ రెడ్డి. బీఆర్ఎస్ గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కోసం నెలకు రూ.52 కోట్లు ఖర్చు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నెలకి రూ.89 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఆరోగ్య శ్రీ ఇవ్వకపోవడం వల్ల చికిత్స చేయట్లేదు అనేది అపోహ మాత్రమే అన్నారు. ఇన్ని ఇబ్బందుల్లో కూడా ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. విద్యా, వైద్యం విషయంలో కోతలు ఉండవని సీఎం రేవంత్ మరోసారి తేల్చి చెప్పారు. కోతలు పెట్టాల్సి వస్తే వేరే కోతలు పెడతామని అన్నారు. టీచింగ్ కాలేజీల నిర్వహణ గ్రూప్-1 అధికారులకు అప్పగిస్తామని, ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించేందుకు కొత్త పథకం తీసుకువస్తున్నట్లు సీఎం రేవంత్ తెలిపారు.

# కాంగ్రెస్ కొత్తగా చేసిందేమీ లేదు..

## అసెంబ్లీలో మైక్ కట్ చేయడంపై ఎమ్మెల్యే హరీశ్ రావు ఆగ్రహం

హైదరాబాద్,అన్వేషనేత్రం ప్రతినిధి

రాష్ట్రంలో ఆరోగ్య రంగానికి సంబంధించిన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలపై ఎమ్మెల్యే హరీశ్ రావు ఘాటుగా స్పందించారు. అసెంబ్లీ వేదికగా తమ గళాన్ని వినిపించేందుకు ప్రయత్నించినప్పటికీ, మైక్ ఇవ్వకపోవడంపై హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మైకులు కట్‌చేసి తాము చెప్పాలనుకున్న వాస్తవాలను సభ దృష్టికి తీసుకురాకుండా ప్రభుత్వం అడ్డుపడుతోందన్నారు.హరీశ్ రావు మాట్లాడుతూ.. 'ఆరోగ్యశ్రీ ఖర్చుల పెంపుపై ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. 2014 జూన్ 2 నాటికి ఆరోగ్యశ్రీ కోసం నెలకు రూ.32 కోట్లు ఖర్చయ్యేవి. 2023 నాటికి ఇది రూ.68 కోట్లకు చేరుకుంది. కానీ.. ప్రభుత్వం రూ.89 కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతోంది. జనాభా పెరుగుదల, వైద్య ఖర్చుల పెరుగుదల దృష్ట్యా ఈ పెంపు సహజం, ఇందులో కాంగ్రెస్ కొత్తగా సాధించిన ఘనతేమీ లేదు. కాంగ్రెస్ వచ్చిన తర్వాతే ఆరోగ్యశ్రీ ఖర్చులు బాగా పెరిగిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసి, పనులు చేపట్టిన ఆసుపత్రుల నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వం జాప్యం చేస్తోంది. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ఉంటే ఆ ఆస్పత్రులన్నీ పూర్తై ప్రజలకు మెరుగైన సేవలు అందేవి. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు మరింత అండగా నిలవాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎక్సైజ్ అదాయంలో వాటాను పెంచి నిధులను సమకూర్చింది' అని అన్నారు.

# రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీసీలే బొంద పెడుతారు: ఎమ్మెల్యే తలసాని

హైదరాబాద్ అన్వేషనేత్రం ప్రతినిధి

బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. బీసీల సంక్షేమానికి ప్రతి వార్షిక బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు ఖర్చు పెడతామని చెప్పి కాంగ్రెస్ నేతలు మోసం చేశారని ఆయన సోదాహరణగా వివరించారు. గురువారం హైదరాబాద్‌లో అసెంబ్లీ సమీపంలోని గన్ పార్క్ వద్ద బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీలను మోసం చేశారన్నారు.కర్ణాటక సీఎం సిద్ధరామయ్యతో అబద్ధాలు చెప్పించి బీసీల ఓట్లు దండుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మొదటి ఏడాది బీసీ సబ్ ప్లాన్‌కు రూ.800 కోట్లు ఖర్చు చేస్తామని చెప్పి మోసం చేశారన్నారు. రెండో ఏడాది రూ.11 వేల కోట్లు నిధులు కేటాయించి.. కేవలం రూ. 3 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు. బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పే టైం వచ్చిందని చెప్పారు. రాబోయే రోజుల్లో బీసీలే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బొంద పెడతారని జోస్యం చెప్పారు. లోకల్ బాడీ ఎలక్షన్స్‌లో జనరల్ స్థానాల్లో బీసీలు గెలిచారని.. ఇది దేనికి సంకేతమో అర్థం చేసుకోవాలని కాంగ్రెస్ నేతలకు ఆయన సూచించారు.బీసీ విద్యార్థుల కోసం పెద్ద ఎత్తున గురుకులాలను ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌దేనని తలసాని శ్రీనివాస్ యాదవ్ గుర్తు చేశారు. అలాగే లింగయ్య యాదవ్‌ను రాజ్యసభకు పంపించారని తెలిపారు. చాలా మంది బీసీ నాయకులకు అత్యున్నత పదవులు ఇచ్చిన ఘనత కూడా కేసీఆర్‌కే దక్కుతుందని గుర్తు చేశారు. కుల వృత్తులను ప్రోత్సహించిన ఘనత సైతం కేసీఆర్‌దేనని తలసాని శ్రీనివాసయాదవ్ తెలిపారు.9 షెడ్యూల్‌లో చేర్చకుండా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పేరుతో మోసం చేశారని కాంగ్రెస్ నేతలపై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పార్టీ మోసాలను బీసీలు గమనిస్తూనే ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనీ బొంద పెట్టడం ఖాయమని తలసాని శ్రీనివాసయాదవ్ జోస్యం చెప్పారు. గన్ పార్క్ వద్ద నిర్వహించిన నిరసనలో మాజీ మంత్రి హరీశ్ రావుతోపాటు పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# ఇరాన్ టోల్ ఫీజు వసూలు చేస్తోందా.. హోర్ముజ్‌లో నౌకలు నగదు చెల్లిస్తున్నాయా..

హైదరాబాద్, అన్వేషనేత్రం ప్రతినిధి

పశ్చిమాసియాలో చమురు సరఫరాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిని ఇరాన్ నియంత్రిస్తున్న సంగతి తెలిసిందే. హోర్ముజ్‌ను ఇరాన్ మూసివేయడంతో పలు దేశాలు ఇంధన సంక్షోభంలో చిక్కుకున్నాయి. అయితే ఈ జలసంధిని భారత్ సహా ఐదు మిత్ర దేశాల కోసం తెరుస్తున్నట్టు తాజాగా ఇరాన్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో మరో సంచలన వార్త బయటకు వచ్చింది. హోర్ముజ్ గుండా ప్రయాణించే నౌకల నుంచి ఇరాన్ రివల్యూషనరీ గార్డులు (×=+జ) చాలా రోజుల నుంచి అనధికారికంగా టోల్ ఫీజు వసూలు చేస్తున్నారట. హోర్ముజ్‌లో ఇరాన్ రివల్యూషనరీ గార్డులు అనధికారికంగా టోల్ బూత్ వ్యవస్థను నడపుతున్నారని షిప్పింగ్ న్యూస్ వెబ్‌సైట్ 'లాయిడ్స్‌లిస్ట్' పేర్కొంది. మార్చి 13వ తేదీ నుంచి ఆ ఫీజులు వసూలు చేస్తున్నట్టు తెలిపింది. ఐఆర్‌జీసీ నిర్దేశించిన ఫీజు కట్టి ఇప్పటివరకు 26 నౌకలు హోర్ముజ్ దాటినట్టు 'లాయిడ్స్‌లిస్ట్' వెల్లడించింది. ఫీజు కట్టిన తర్వాత కూడా ఆ నౌకలు ఎప్పటిలా సాధారణ మార్గంలో ప్రయాణించలేదట. ఇరాన్ అధికారులు అనుమతించిన మార్గంలోనే ప్రయాణించాయట .పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ప్రారంభమైన నాటి నుంచి భారత్‌కు రావాల్సిన ఐదు నౌకలు హోర్ముజ్‌ను దాటాయి వాటిల్లో ఇప్పటికే మూడు భారత పోర్టులకు చేరుకున్నాయి. మరో రెండు నౌకలు ఈ వారాంతానికి చేరుకోబోతున్నాయి. అయితే భారత్‌కు చెందిన నౌకలు కూడా ఈ టోల్ ఫీజులు చెల్లించాయా, లేదా అనే విషయంలో క్లారిటీ లేదు.

# ఇంధన నిల్వలు ఉన్నాయి.. ఆందోళన వద్దు: స్టీఫెన్ రవీంద్ర

హైదరాబాద్,

రాష్ట్రంలో ఇంధన నిల్వలు ఉన్నాయని.. దీనిపై ఆందోళన అవసరం లేదని ప్రజలకు పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. బుధవారం 2,123 ట్యాంకర్స్ పెట్రోల్ సరఫరా చేశామన్నారు. అలాగే 10,799 లీటర్లు సరఫరా చేశారని వివరించారు. యావరేజ్‌గా 5,883 లీటర్ల పెట్రోల్ వినియోగం ఉంటే.. బుధవారం ఒక్క రోజే 84 శాతం అధికంగా పెట్రోల్ సరఫరా చేశారని చెప్పారు. 22,127 కిలో లీటర్ల డీజిల్ ఆయిల్ కంపెనీలు సరఫరా చేశాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ 596 అవుట్ లెట్స్ ఉన్నాయని అన్నారు. ప్రతీ బంక్‌లో పౌరసరఫర, సివిల్ సప్లై, రెవెన్యూ, పోలీస్, లీగల్ మెట్రాలజీ అధికారుల బృందం పరిశీలన చేస్తుందని తెలిపారు. బుధవారం కంటే.. గురువారం పెట్రోల్ బంకుల వద్ద రద్దీ తగ్గిందన్నారు. రాష్ట్రంలో గృహ వినియోగంలో 1,28,24,087 ఎల్పీజీ కనెక్షన్లు ఉన్నాయని.. ప్రతీ రోజు 2,20,000 గ్యాస్ బుకింగ్స్ జరుగుతున్నాయని పేర్కొన్నారు.బుధవారం ఒక్క రోజే 2,19,980 సిలిండర్లు సరఫరా చేశామన్నారు. వినియోగదారులు అధికంగా బుకింగ్స్ చేయడం వల్ల కొంత ఇబ్బంది ఏర్పడుతుందని స్టీఫెన్ రవీంద్ర వివరించారు. అలాగే 1,03,275 పైప్ న్యాచురల్ గ్యాస్ (పీఎన్జీ) కనెక్షన్లు ఉన్నాయని చెప్పారు. 2,78,418 క్యూబిక్ మీటర్లు సరఫరా చేస్తున్నారని తెలిపారు. కేంద్రం ఆదేశాల మేరకు పీఎన్జీ, సీఎన్జీని విస్తరించాల్సి ఉందని చెప్పారు. 24 గంటల్లో ప్లాంట్లకు అనుమతి ఇవ్వడంతో పాటు పలు రాయితీలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించిందని స్టీఫెన్ రవీంద్ర వివరించారు.

# మొయినాబాద్ డ్రగ్స్ కేసులో కొత్త ట్విస్ట్.. డాక్టర్‌ని అదుపులోకి తీసుకున్న సిట్

హైదరాబాద్,

మొయినాబాద్ డ్రగ్స్ కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (ూ×ు) తాజాగా జూబ్లీహిల్స్‌కు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ బాలాజీని అదుపులోకి తీసుకుంది. ఈ అరెస్టుతో డ్రగ్స్ నెట్‌వర్క్‌లో ఉన్న మరిన్ని పేర్లు వెలుగులోకి వస్తున్నాయి.

### ఫామ్‌హౌస్ కేంద్రంగా డ్రగ్స్ పార్టీలు

విచారణలో తేలిన వివరాల ప్రకారం, రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌ను డ్రగ్స్ పార్టీల కోసం ఒక 'డెన్'గా వినియోగించినట్లు సిట్ గుర్తించింది. గతంలో పట్టుబడిన రోహిత్ రెడ్డి, రితీష్ రెడ్డిలను విచారించిన సమయంలో డాక్టర్ బాలాజీ పేరు బయటకు వచ్చింది. డ్రగ్ పెడ్లర్ రాకేష్ వర్మ నుంచి డాక్టర్ బాలాజీకి వీణహీూ వంటి ప్రమాదకరమైన డ్రగ్స్ అందినట్లు ఆధారాలు లభించాయి.

### నిందితుల సంఖ్య 15కు చేరిక

ఈ కేసులో లోతైన విచారణ జరుగుతున్న కొద్దీ నిందితుల జాబితా పెరుగుతోంది. ఇప్పటివరకు 11 మందిగా ఉన్న నిందితుల సంఖ్య, తాజా అరెస్టులతో 15కు చేరింది. పెడ్లర్ రాకేష్ వర్మ, అభిషేక్, డాక్టర్ బాలాజీలతో పాటు మరో వ్యక్తిని కూడా నిందితుల జాబితాలో చేర్చారు.

### ముగ్గురి కోసం వేట

ప్రస్తుతం ఈ కేసులో ప్రమేయం ఉన్న మరో ముగ్గురు వ్యక్తులు పరారీలో ఉన్నారు. వారి కోసం సిట్ బృందాలు గాలిస్తున్నాయి. డాక్టర్ బాలాజీకి డ్రగ్స్ సరఫరా చేయడమే కాకుండా, అతను ఈ పార్టీల నిర్వహణలో ఏవైనా ఇతర బాధ్యతలు చేపట్టాడా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. ఉన్నత వర్గాలకు చెందిన వారు ఈ కేసులో ఇరుక్కోవడంతో నగరంలో తీవ్ర కలకలం రేగుతోంది.

# భూముల కేటాయింపుతో ప్రభుత్వానికి రూ.1,540 కోట్ల ఆదాయం : శ్రీధర్ బాబు

హైదరాబాద్:

దావోస్ పర్యటనల్లో 44 ఎంవోయూలు ప్రభుత్వం కుదుర్చుకుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. రాష్ట్రానికి రూ. 2.19 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని అన్నారు. తెలంగాణ అసెంబ్లీలో సమావేశాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా దావోస్ పెట్టుబడులపై శ్రీధర్ బాబు మాట్లాడారు. పెట్టుబడులతో 68,150 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు వస్తాయని, 2024 దావోస్ లో 18 ఎంవొయూలు.. రూ.40,232 కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలియజేశారు. రూ.81,800 కోట్ల పెట్టుబడులతో 6 కంపెనీలకు భూముల కేటాయింపు జరిగిందని, భూముల కేటాయింపుతో ప్రభుత్వానికి రూ.1,540 కోట్ల ఆదాయం కేటాయించామని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మరో 3 కంపెనీలకు రూ.30 వేల కోట్ల పెట్టుబడుల కోసం భూముల గుర్తింపు చర్యలు చేశామని, నిజామాబాద్ ఐటీ టవర్ లో 11 కంపెనీలు కార్యకలాపాలు జరిగాయని అన్నారు. నిజామాబాద్ లో 681 సీట్ల సామర్థ్యంతో ఐటి టవర్ నిర్మించామని, నిజామాబాద్ ఐటీ టవర్ లో ప్రస్తుతం 276 మంది ఉద్యోగాలు పనిచేస్తున్నారని అన్నారు. పెట్టుబడుల ఒప్పందాలపై శ్వేతపత్రం విడుదల చేస్తామని, పరిశ్రమల ఏర్పాటు వల్ల రాష్ట్రానికి బహుళ ప్రయోజనాలు, ఉపాధి లభిస్తుందని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

# ఘోర రోడ్డు ప్రమాదం.. స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి..

హైదరాబాద్:

ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం రాయవరం రోడ్డు ప్రమాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనలో 13 మంది మృతిచెందడం, 20 మందికి తీవ్రగాయాలు కావడంపై సీఎం రేవంత్ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి ట్వీట్ చేశారు.నిర్మల్ నుంచి నెల్లూరు వైపు బస్సు వెళుతున్న నేపథ్యంలో మృతిచెందిన, గాయపడిన వారి వివరాలను తెలుసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును ఆదేశించారు. ఏపీ అధికారులతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించాలని ఆజ్ఞాపించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సహాయం అందేలా చూడాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఆంధ్రప్రదేశ్ సీఎస్ సాయిప్రసాద్‌తో ఆయన మాట్లాడారు. ప్రమాదం గురించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు.కాగా, ఇవాళ(గురువారం) తెల్లవారుజామున తెలంగాణ రాష్ట్రం నిర్మల్ నుంచి ఏపీలోని నెల్లూరు వైపునకు వెళ్తున్న బస్సు ప్రమాదానికి గురైంది. ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం రాయవరం వద్దకు రాగానే కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్, హరికృష్ణ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఒక్కసారిగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 13 మంది సజీవ దహనమవ్వగా.. 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను మార్కాపురం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, అనిత, సవిత, రాంప్రసాద్ రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి, అచ్చెన్నాయుడు సహా పలువురు స్పందించారు.

# సిరిసిల్లలో విషాదం.. మూడేళ్ల కొడుతో బావిలో దూకిన తల్లి..

ఓ మహిళ తన మూడేళ్ల బిడ్డతో బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాద ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండలం రంగంపేట గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఎలవేని రేఖ(25) అనే మహిళ, తన కుమారుడు (3)తోపాటు.. తల్లిగారి ఇంటి వద్ద ఉన్న వ్యవసాయ బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనలో తల్లి, కొడుకు ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను బావి నుంచి బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఆరా తీసిన పోలీసులు.. కుటుంబ సమస్యల కారణంగానే రేఖ ఈ దారుణానికి పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## విద్యాభివృద్ధి ద్వారానే సమాజ అభివృద్ధి









నల్లగొండ నియోజకవర్గం:-అన్వేషనేత్రం ప్రతినిధి

కనగల్ మండల కేంద్రంలో రూ.6 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేయనున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి రాష్ట్ర రోడ్లు,భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు శంకుస్థాపన చేశారు..విద్యాభివృద్ధి ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమని పేర్కొన్న మంత్రి, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు..ఈ నూతన కళాశాల భవనం నిర్మాణంతో స్థానిక విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు ఉన్నత విద్యను కొనసాగించేందుకు మరింత అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు..నిర్మాణ పనులను నిర్ణీత కాలంలో పూర్తి చేసి త్వరగా విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశించారు..

## మృతిని కుటుంబానికి అండగా మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు.. లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేత..



కనగల్ మండల కేంద్రానికి చెందిన ఎటెల్లి పరుశురాం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా గురువారం నాడు వారి కుటుంబ సభ్యులను రాష్ట్ర రోడ్లు భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు పరామర్శించారు.. పరుశురాం భార్య ఎటెల్లి సంధ్య వారి పిల్లలకు మంత్రి భరోసా కల్పించారు..తక్షణ సహాయం కింద 1 లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు..పిల్లల చదువుకు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు..

# నిజాంపేట్, పేట్ బషీరాబాద్ స్థలాలే కేటాయించాలి

### మోసం చేసిన కమిటీ పెద్దలపై విచారణ జరపి శిక్షించాలి

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జెఎన్‌జేహెచ్ఎస్ సభ్యుల విజ్ఞప్తి

హైదరాబాద్, మార్చి 26: వెయ్యి మంది జర్నలిస్టుల కుటుంబాలను రోడ్డున పడేసే కమిటీ పెద్దల కుట్రలపై విచారణ జరిపించాలని...పేట్ బషీరాబాద్, నిజాంపేట్ స్థలాలనే కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌజింగ్ సొసైటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌజింగ్ సొసైటీ సభ్యులు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. 16 ఏళ్ల నుంచి తాము పడుతున్న కష్టాలను మీడియా ముందు వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీరే మాకు దిక్కంటూ వేడుకున్నారు. సొసైటీ ఏర్పడిన నాటి నుంచి సభ్యులను కమిటీ పెద్దలు మభ్యపెడుతూ కుట్రలకు పాల్పడ్డారని.. ప్రభుత్వాలు ఇచ్చిన నిజాంపేట్, పేట్ బషీరాబాద్ స్థలాలను కుట్రపూరితంగా డెవలప్ చేయకుండా అక్రమాలకు పాల్పడ్డారని జెఎన్‌జే హెచ్ ఎస్ సభ్యులు ఆరోపించారు. నిజాంపేట్, పేట్ బషీరాబాద్ స్థలాల్లో అక్రమ కట్టడాల వెనకాల అప్పటి కమిటీ పెద్దలు ఉన్నారని, వారిపై విచారణ చేపడితే వారి మోసాలన్నీ బయటకు వస్తాయన్నారు. 2008లో జెఎన్‌జే సొసైటీ ఏర్పడిన తర్వాత ఒక్కక్కరి నుండి 2లక్షల చొప్పున దాదాపు 23 కోట్ల రూపాయలు వసూలు చేశారని, అందులో 12.33 కోట్ల రూపాయలు మాత్రమే ప్రభుత్వ ఖజానాకు జమ చేశారన్నారు. అప్పటి నుండి సభ్యుల డబ్బులను దుబారా చేయడమే కాకుండా...ఎలాంటి జీబీలు, సమావేశాలు, ఎన్నికలు నిర్వహించకుండా ఏకపక్షంగా సొసైటీని నడిపించారని ఆరోపించారు. సభ్యులు అఫిడవిట్ ఇచ్చి స్థలాలు తీసుకోవచ్చని 2010లో హైకోర్టు చక్కని రూలింగ్ ఇచ్చినా... సభ్యులకు తెలియజేయకుండా



దాచిపెట్టడమే గాక, కనీసం జీబీ లేకుండా సుప్రీంకోర్టుకు తీసుకెళ్లారని జర్నలిస్టు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. 2017లో డెవలప్ చేసుకోవచ్చని, 2022లో నిర్మాణాలు చేపట్టవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా ఆ తీర్పును కాలదోషం పట్టించి సభ్యులను కమిటీ పెద్దలు నిండా మంచారని తెలిపారు. మరోవైపు నిజాంపేట్ , పేట్ బషీరాబాద్‌లో అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తూ లాభం పొందినట్లు సభ్యులు ఆరోపించారు. ముఖ్యమంత్రి మీరే దిక్కుఅపాయింట్ మెంట్ ఇస్తే కష్టాలు చెప్పుకుంటాం

పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నపుడు రేవంత్ రెడ్డి దృష్టికి తమ సమస్యను తీసుకెళితే సావధానంగా విని, అధికారంలోకి వచ్చిన వెంటనే పేట్‌బషీరాబాద్ స్థలాన్ని అప్పగించినందుకు సభ్యులు మరోసారి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం ఎంతో ఉదారంగా ఇచ్చిన స్థలాన్ని కూడా కమిటీ పెద్దలు కుట్రపూరితంగా హ్యాండోవర్ చేసుకోకుండా తమ పొట్ట కొట్టారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిటీ పెద్దల తీరుతో ఇప్పటికే చాలా అన్యాయమై పోయిన తమను ముఖ్యమంత్రి ఆదుకోవాలని, ఏ స్థలాల కోసం 16 ఏళ్ల కిందట డబ్బులు కట్టామో వాటిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో ఉద్యోగ బాధ్యతలు చూస్తున్న జర్నలిస్టులకు నగరానికి సుదూరంగా ఇవ్వడం సరికాదన్నారు. ఇక్కడ కూడా బడుగు జర్నలిస్టుల పొట్టకొట్టడానికి బడా జర్నలిస్టుల పేరిట అవే కుట్రలు జరుగుతున్నాయని, వారిని దూరంగా ఉంచాలని ముఖ్యమంత్రిని కోరారు. ఇప్పటికే దాదాపు 90 మంది సభ్యులు చనిపోయారని, మరో 200 మందికి పైగా జర్నలిస్టులు వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి అపాయింట్ మెంట్ ఇస్తే... 16 ఏళ్ల నుంచి తమపై జరుగుతున్న మోసాలు, తాము పడుతున్న కష్టాలను వివరిస్తామని జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ సభ్యులు వేడుకున్నారు.

# కాంగ్రెస్ కార్యకర్తలు బైక్ ర్యాలీ

నాచారం సిగ్నల్ నుండి హెచ్ఎంటీ నగర్ వరకు వి.ఎస్. ప్రకాశ్ రెడ్డి గారి ఆధ్వర్యంలో, ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ మందుముల పరమేశ్వర్ రెడ్డి గారు పాల్గొనగా, వందలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించి కార్యక్రమ స్థలానికి చేరుకున్నారు.తదుపరి నాచారం ఓ హెచ్ఎంటీ నగర్ డివిజన్‌లో నిర్వహించిన "చలివేంద్రం" ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ మందుముల పరమేశ్వర్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా పాల్గొని చలివేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి గారు









మాట్లాడుతూ నాచారం మరియు హెచ్ఎంటీ నగర్ డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. పరమేశ్వర్ రెడ్డి గారి నాయకత్వంలో ఈ ప్రాంతాల్లో అనేక అభివృద్ధి పనులు జరిగాయని, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి కొనసాగుతోందని అన్నారు. ఈ అభివృద్ధి పనులు మరియు ప్రజా మద్దతుతో రాబోయే ఎన్నికల్లో ఈ రెండు డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. అలాగే నాచారం ప్రజలకు వి.ఎస్. ప్రకాశ్ రెడ్డి గారు చేస్తున్న సేవలను ప్రశంసిస్తూ, పేద ప్రజల కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం ఎంతో మంచి కార్యక్రమమని అభినందించారు.ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ గౌడ్, జి కృష్ణ రెడ్డి, కాప్రా సాయి, మహేష్ యాదవ్, ఎం శ్రీనివాస్ రెడ్డి, రమేష్, అశ్వత్థామ రెడ్డి, భువన గౌడ్, సునీల్ రెడ్డి, యూసుఫ్, కృష్ణ యాదవ్, నర్సింగ్ రావు, సుధాకర్ రెడ్డి, షరీఫుద్దీన్, ఫిరోజ్, రేవంత్, షాహిద్, పాషా, నరేష్, చి. నరేష్, రఘు, కృపాకర్, రాజేష్, శశి, బాల్‌రాజ్, శ్రీనివాస్ రెడ్డి, ఉమ, సునీత, సుష్మిత, మమత, విజయమ్మ, యాస్మీన్ తదితరులు పాల్గొన్నారు.



దేవరకద్ర నియోజకవర్గం : చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్ గ్రామంలో మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు కుట్టుమిషన్ టైలరింగ్ ట్రైనింగ్ క్యాంపును తమ సొంత నిధులతో ఏర్పాటుచేసిన దేవరకద్ర ఎమ్మెల్యే శ్రీ. జి. మధుసూదన్ రెడ్డి గారి సతీమణి శ్రీమతి. కవిత మధుసూదన్ రెడ్డి గారు.

దేవరకద్ర ఎమ్మెల్యే గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసిన మహిళలు



## తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ సేవలను విస్తరించేందుకు చర్యలు

హైదరాబాద్, గ్రామీణ ప్రాంతాల్లో కనెక్టివిటీ మెరుగుపరచడంపై దృష్టి

మహాలక్ష్మి పథకం కింద ప్రయాణికుల సంఖ్య పెరిగిన దృష్ట్యా, తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ సేవలను మరింత విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో అసెంబ్లీ కమిటీ హాల్--1లో మూడు రోజుల పాటు ఒక సమగ్ర సమావేశం జరుగుతోంది. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ మంత్రులు, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ ఆర్టీసీ అధికారులు పాల్గొంటున్నారు. మొదటి రోజు, ఉమ్మడి నల్గొండ, మెదక్, రంగారెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ జిల్లాల



ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లోని ఆర్టీసీ సంబంధిత సమస్యలను ప్రస్తావించారు. ఈ సమాచారం ఆధారంగా అధికారులు ఒక సమగ్ర నివేదికను రూపొందిస్తున్నారు. నల్గొండ జిల్లా నుంచి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బాలు నాయక్, జయవీర్ రెడ్డి, కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. మహాలక్ష్మి పథకం విజయవంతంగా అమలు జరుగుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కొత్త బస్సుల కొనుగోలు, రూట్ల విస్తరణ, ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పూర్తి మద్దతు ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. కోదాడ్, హుజూర్‌నగర్ బస్ స్టేషన్లలో అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కూడా ఆయన సూచించారు.




RNI.No. TELTEL/2010/32434
ఎడిటర్: గోళ్ల రమేష్ తెలుగు దినపత్రిక

**సంపాదకీయం...**

# ప్రజల సంపదపై ప్రైవేటు పెత్తనమే పి3

రాష్ట్రంలో నిర్మాణ దశలో ఉన్న 10 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడానికి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. కొంత పెట్టుబడి పెడితే రెండు, మూడు సంవత్సరాల్లో పూర్తి చేయగలిగిన అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవన్న సాకుతో ప్రైవేటు కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారు. దీనిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతో స్వరం మార్చి, తాము ప్రైవేటుపరం చేయడం లేదని, యాజమాన్యం ప్రభుత్వ రంగంలోనే ఉంటుందని ముఖ్యమంత్రితో సహా ప్రభుత్వ నేతలు పదే పదే ప్రకటిస్తున్నారు. అయితే ఒక మంత్రి కేవలం




నిర్మాణం పూర్తి చేయడానికే కాంట్రాక్టరును మార్చామని చెప్పగా, మరొక మంత్రి నిర్మాణం పూర్తి చేసి నిర్వహణా బాధ్యత కూడా వారే చూస్తారని అన్నారు.

ఇలా మంత్రులు ఒకరికొకరు పొంతన లేకుండా మాట్లాడటమే కాకుండా వైసిపి స్వప్రయోజనాల కోసం నియమించిన కాంట్రాక్టర్లను మార్చినందువల్ల తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. మొత్తం ప్రైవేటీకరణ అంశాన్ని తెలుగుదేశం, వైసిపి ల మధ్య రాజకీయ వివాదంగా మార్చే ప్రయత్నం రెండు పార్టీలు చేస్తున్నాయి. ఈ వివాదం నడుస్తుండగానే ముఖ్యమంత్రి అసెంబ్లీలో మాట్లాడుతూ ప్రభుత్వం దగ్గర డబ్బు లేనందువల్ల ఆలస్యం కాకుండా త్వరగా పూర్తి చేయడానికి ప్రభుత్వంతో పాటు ప్రైవేటు భాగస్వామ్యమిచ్చామని 33 సంవత్సరాల తర్వాత ఇది తిరిగి ప్రభుత్వ స్వాధీనమవుతుందని చెప్పారు. ఇంతలోనే మాట మార్చి 66 సంవత్సరాల వరకు పొడిగించే అవకాశం ఉందని సెలవిచ్చారు. అంతేకాకుండా తన ప్రైవేటీకరణ పథకాలను సమర్థించుకోడానికి చైనా సంస్కరణలతో పోలుస్తూ అసెంబ్లీలో పెద్ద ఉపన్యాసం చేశారు. ఈ మాటలు విన్నవారికి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసమే చిత్తశుద్ధితో ఆలోచిస్తున్నట్లు భ్రమలు కలిగే అవకాశం ఉంది. వేల కోట్ల రూపాయల విలువ చేసే ఈ 10 మెడికల్ కాలేజీలను పి3 కిందకు మార్చడం హేతుబద్ధమేనా? తద్వారా ప్రజలకు మేలు జరుగుతుందా లేదా? ఆలోచించాల్సిన అవసరం ఉంది.

## అబద్ధాలతో సమర్థించుకోలేరు

గత ప్రభుత్వం 2021లో 17 మెడికల్ కాలేజీలను ప్రభుత్వరంగంలో అదీ ఎక్కువ భాగం వెనుకబడిన ప్రాంతాల్లో పెట్టేందుకు నిర్ణయించింది. స్థలాలు కొనుగోలు చేసింది. వీటికి కేంద్ర ప్రభుత్వం వివిధ రూపాల్లో 60 శాతం ఖర్చు భరిస్తుంది. 2024 నాటికి 5 కాలేజీలు పూర్తయి నడుస్తున్నాయి. మరో రెండు కాలేజీలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నా ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం ఆపేసింది. ఫ్యాకల్టీని వెనక్కి పంపింది. కేంద్రం కేటాయించిన మెడికల్ సీట్లను తిరస్కరించింది. మిగతావి 20 నుండి 70 శాతం మధ్య నిర్మాణ దశలో ఉన్నాయి. అయితే అదే సమయంలో 107 జీవో తెచ్చి సగం సీట్లు సెల్ఫ్ ఫైనాన్స్ పేరుతో ప్రభుత్వమే అమ్మకానికి పెట్టింది. దీన్ని నాడు వామపక్షాలతో సహా టిడిపి కూడా వ్యతిరేకించింది. ఇప్పుడదే పార్టీ మాట తప్పి మొత్తానికి మొత్తం ప్రైవేటుకి అప్పగిస్తున్నది. తమ తప్పును సమర్థించుకోడానికి ఆ పది కాలేజీల నిర్మాణం అసలు ప్రారంభమే కాలేదని, ఒట్టి స్థలాలు మాత్రమే ఉన్నాయని సెల్ఫీలు దిగి జనాన్ని తప్పుదారి పట్టిస్తున్నది.

## చంద్రబాబు సమర్ధతకు ఇది పరీక్ష

గత ప్రభుత్వ అనుభవాన్ని బట్టి వీటిని రాబోయే నాలుగైదు ఏళ్లలో పూర్తి చేయవచ్చు. చంద్రబాబు ప్రభుత్వం సమర్ధవంతమైందని చెప్పుకుంటున్నారు కాబట్టి మూడేళ్లల్లో కూడా పూర్తిచేయవచ్చు. తమ సమర్ధతను నిరూపించుకోవడానికి మంచి అవకాశం వచ్చినా పి3 పేరుతో వీటిని ప్రైవేటు కంపెనీలకు ధారాదత్తం చేయడాన్ని ఏమనాలి? దీని వల్ల ఎస్సీ, ఎస్టీ, బిసి విద్యార్థులకే కాదు అగ్ర కులాల్లోని పేద విద్యార్థులకు కూడా అవకాశాలు తగ్గిపోతాయి. పేద, మధ్య తరగతి వర్గాలకు వైద్యం దూరమవుతుంది. ఇప్పటి వరకు ఎంతో కొంత అందుబాటులో ఉన్న ఎన్‌టిఆర్ వైద్యసేవ ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీల పాలైంది.

# ఎమిరేట్స్ విమానాల్లో పవర్ బ్యాంక్‌లు నిషేధం

**దుబాయ్:**

యుఎఇ జాతీయ విమానయాన సంస్థ ఎమిరేట్స్ విమానాల్లో పవర్ బ్యాంక్‌ల వాడకాన్ని నిషేధించింది. ఈ నిర్ణయం అక్టోబర్ 1 నుండి అమల్లోకి వచ్చింది. కొత్త నిబంధన ప్రకారం, ప్రయాణీకులు తమ క్యాబిన్ బ్యాగేజీలో 100 వాట్-అవర్స్ కంటే తక్కువ సామర్థ్యం గల పవర్ బ్యాంక్‌ను తీసుకెళ్లవచ్చు. కానీ పవర్ బ్యాంక్‌ను విమానం అంతటా ఉపయోగించకూడదు. స్మార్ట్‌ఫోన్‌లు, టాబ్లెట్‌లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ఛార్జ్ చేయడానికి లేదా విమానం సీటులోని విద్యుత్ సరఫరాను ఉపయోగించి పవర్ బ్యాంక్‌లను రీఛార్జ్ చేయడానికి పవర్ బ్యాంక్‌లను ఉపయోగించలేరు. ప్రమాదాలను తగ్గించడానికి, భద్రతను దృష్టిలో ఉంచుకోవడానికి ఈ చర్య తీసుకున్నట్లు ఎమిరేట్స్ అధికారులు తెలిపారు. అన్ని ఎమిరేట్స్ విమానాల్లో సీటులో ఛార్జింగ్ సౌకర్యాలు ఉన్నాయి. అయితే, ప్రయా




ణీకులు తమ ప్రయాణాన్ని ప్రారంభించే ముందు %-% ముఖ్యంగా సుదూర విమానాల్లో %-% తమ పరికరాలను పూర్తిగా ఛార్జ్ చేయాలని ఎమిరేట్స్ తెలిపింది. ప్రయాణీకుల చేతుల్లో ఉన్న అన్ని పవర్ బ్యాంక్‌లు సామర్థ్యం, రేటింగ్ సమాచారాన్ని కలిగి ఉండాలి. పవర్ బ్యాంక్‌లను విమానం యొక్క ఓవర్‌హెడ్ స్టోవేజ్ బిన్‌లో ఉంచకూడదని ఎమిరేట్స్ ఆంక్షలు జారీ చేసింది. వాటిని సీటు జేబులో లేదా వాటి ముందు సీటు కింద ఉన్న బ్యాగ్‌లో ఉంచాలి. చెక్డ్ లగేజీలో పవర్ బ్యాంకులు అనుమతించబడవు. పవర్ బ్యాంకులలో ఉపయోగించే లిథియం బ్యాటరీల వల్ల కలిగే ప్రమాదాలను నివారించడానికి ఈ చర్య తీసుకోబడిందని వారు పేర్కొన్నారు.

## యుద్ధ విమానాల తయారీ పోటీలో అదానీ, టాటా..

న్యూఢిల్లీ : ఐదో తరానికి చెందిన యుద్ధ విమానాలను తయారు చేసేందుకు ఏడు భారతీయ కంపెనీలు రక్షణ మంత్రిత్వ శాఖకు బిడ్లు సమర్పించాయి. అమెరికా, రష్యా, చైనా దేశాలు ఈ తరహా యుద్ధ విమానాలను దేశీయంగానే తయారు చేసుకుంటున్నాయి. వాటి సరసన చేరాలని నిర్ణయించుకున్న రక్షణ శాఖ దేశీయ కంపెనీల నుంచి బిడ్లను ఆహ్వానించింది. అత్యాధునిక మధ్య శ్రేణి యుద్ధ విమానాల (ఎఎంసిఎ) తయారీకి ప్రముఖ సంస్థలైన ఎల్ అండ్ టి, హాల్, అదానీ డిఫెన్స్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్, కల్యాణ్ స్ట్రాటజిక్ సిస్టమ్స్ ముందుకు వచ్చాయి. 2030వ దశకం మధ్య నాటికి ఈ విమానాలు రక్షణ శాఖకు అందుతాయి.

# తొలి ట్రిలియనీర్ దిశగా కుబేర ఎలాన్‌మస్క్ రికార్డు ..!

**ఇంటర్నెట్ :**

ఎలాన్‌మస్క్ రికార్డు స్పష్టించారు. ఫోర్బ్స్ ప్రకారం %ా% ఎలాన్ మస్క్ చరిత్రలో తొలి వ్యక్తిగా 500 బిలియన్ డాలర్లకుపైగా సంపత్తి కలిగిన వ్యక్తిగా నిలిచారు. ఇది ప్రధానంగా టెస్లా షేర్ల విలువ పెరగడం, ఆయన ఇతర కంపెనీలు.. ఎఐ స్టార్టప్ ఎక్స్ ఎఐ, రాకెట్ కంపెనీ స్పేస్‌ఎక్స్.. విలువ పెరగడం వల్ల సాధ్యమైంది. బుధవారం మధ్యాహ్నం ఫోర్బ్స్ బిలియనేర్స్ జాబితాలో మస్క్ సంపత్తి 500.1 బిలియన్ డాలర్లుగా నమోదైంది. టెస్లా షేర్లు బుధవారం సుమారు 4 శాతం పెరిగి, మస్క్ సంపత్తిలో మరో 7 బిలియన్ డాలర్లు చేరువయ్యాయి. ఈ ఏడాదిలో టెస్లా షేర్లు 14 శాతం పైగా పెరిగాయి. సెప్టెంబర్ 15 నాటికి మస్క్ టెస్లాలో 12.4 శాతం వాటా కలిగి ఉన్నారు.

## టెస్లా బోర్డు మస్క్‌కి 1 ట్రిలియన్ డాలర్లు పరిహార ప్రణాళిక

వాహన అమ్మకాలు తగ్గడం, లాభాల ఒత్తిళ్లు వంటి సమస్యలతో టెస్లా షేర్లు "ప్రధాన ఏడు టెక్ కంపెనీలు" టెక్ స్టాక్‌లలో తక్కువ పెరుగుదల చూపాయి. ఇటీవల మస్క్ సుమారు 1 బిలియన్ డాలర్లు విలువైన టెస్లా షేర్లు కొని, కంపెనీ భవిష్యత్తుపై విశ్వాసం చూపించారు. గత నెలలో టెస్లా బోర్డు మస్క్‌కి 1 ట్రిలియన్ డాలర్లు పరిహార ప్రణాళిక ప్రతిపాదించింది, అలాగే ఆయనకు ఎక్కువ వాటా ఇవ్వడానికి నిర్ణయం తీసుకుంది. ఎఐ స్టార్టప్ ఎక్స్ ఎఐ, స్పేస్‌ఎక్స్ కంపెనీల విలువ కూడా ఈ ఏడాదిలో పెరిగాయి. జూలైలో ఎక్స్ ఎఐ విలువ సుమారు 75 బిలియన్ డాలర్లుగా ఉంది. సిఎన్‌బిసి ప్రకారం %ా% ఎక్స్ ఎఐ 200 బిలియన్ విలువను సాధించడానికి ప్రయత్నిస్తోంది. కానీ మస్క్ ఆ సమయంలో ఇలాంటి ప్లాన్ లేదని చెప్పారు.రానున్న రోజుల్లో మార్కెట్ విలువను భారీగా పెంచేందుకు టెస్లా ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. రానున్న రోజుల్లో రోబోట్యాక్సీ, ఏఐ మార్కెట్ విస్తరణ వంటి లక్ష్యాలను పెట్టింది. ఈ పనితీరు లక్ష్యాలను ఎలాన్‌మస్క్ సాధిస్తే ప్రతిపాదిత ప్రోత్సాహక ప్యాకేజీ కింద ఆయనకు భారీగా షేర్లు సమకూరనున్నాయి. దాదాపు 900 బిలియన్ డాలర్లు సమకూరనున్నట్లు అంచనా. దాంతో ఆయన సంపద విలువ ట్రిలియన్ డాలర్లు దాటిపోవచ్చని అంచనా. అయితే ప్రస్తుతం ఆయన కొన్ని సవాళ్లను ఎదుర్కొంటున్నారు. చైనాలోని బీవైడీ తదితర కంపెనీల నుంచి పోటీ కూడా పెరిగింది. జర్మనీలో కూడా అమ్మకాలు పడిపోయాయి. ఈయూ దేశాల్లోను ఇదే పరిస్థితి. భారీ విస్తరణ అంచనాలను వెల్లడించింది.

## రెండవ అతి సంపన్నుడిగా లారీ ఎల్లిసన్

స్పేస్‌ఎక్స్ సుమారు 400 బిలియన్ డాలర్ల విలువతో ఇన్సైడర్ షేర్లు విక్రయించి నిధులు సమీకరించడానికి ప్రయత్నిస్తోందని జూలైలో బ్లూమ్బెర్గ్ తెలిపింది. ఈ కంపెనీల విలువ పెరగడం వల్ల మస్క్ సంపత్తి ఇప్పటివరకు రానంత ఎక్కువ స్థాయికి చేరింది. ఒరాకిల్ స్థాపకుడు లారీ ఎల్లిసన్ రెండవ అతి సంపన్నుడిగా, సుమారు 350.7 బిలియన్ డాలర్లు సంపత్తి కలిగి ఉన్నారు.




RNI.No. TELTEL/2010/32434
ఎడిటర్: గోళ్ల రమేష్ తెలుగు దినపత్రిక

**బిజినెస్..**


# గూగుల్‌లో 100 మంది ఉద్యోగులపై వేటు

**గూగుల్ :**

టెక్ దిగ్గజం గూగుల్ మరోసారి ఉద్యోగులపై వేటు వేసింది. క్లౌడ్ విభాగంలో డిజైన్ సంబంధిత రంగాల్లో పనిచేసే 100 మందిని ఈ వారం తొలగించినట్లు సీఎన్‌బీసీ వెల్లడించింది. వీరిలో క్వాంటిటేటివ్ యూజర్ ఎక్స్‌పీరియన్స్ రీసెర్చ్ బృందం, ప్లాట్‌ఫామ్ అండ్ సర్వీస్ ఎక్స్‌పీరియన్స్ టీం లో సభ్యులు అధికంగా ఉన్నారు.వీరు వినియోగదారుల తీరును డేటా, సర్వేలు, రీసెర్చ్ ఆధారంగా విశ్లేషించే రోల్స్‌లో పనిచేస్తున్నారు. వీరు ఇచ్చే సమాచారం ఆధారంగా గూగుల్ ప్రొడక్ట్‌లను డిజైన్ చేస్తుంది. దీంతోపాటు కొన్నిరకాల క్లౌడ్ డిజైన్ టీమ్‌లను సగానికి కుదించినట్లు తెలుస్తోంది. తాజాగా ఉద్యోగాలు కోల్పోయినవారిలో అత్యధికంగా అమెరికన్లే ఉన్నారు. ఇక మిగిలినవారిని ప్రత్యామ్నాయ పోస్టుల్లో నియమించింది. కృత్రిమ మేధలో కీలకంగా మారేందుకు గూగుల్ చేపట్టిన పున: వ్యవస్థీకరణలో భాగంగానే ఈ లేఆఫ్‌లు విధించారు. గత నెల జెమినీ, ఏఐ ఓవర్ వ్యూ విభాగాల్లో పనిచేస్తున్న 200 మందికి పైగా కాంట్రాక్ సిబ్బందిని గూగుల్ తొలగించింది. ఈ చర్యలతో ఆ సంస్థలోని చాలామంది సిబ్బందిలో ఉద్యోగ భద్రత, తక్కువ వేతనాలు వంటివాటిపై ఆందోళన చెందుతున్నారని వైర్డ్ సంస్థ కథనంలో పేర్కొంది. అయితే ఉద్యోగులు పని వాతావరణంపై మేనేజ్‌మెంట్‌ను ప్రశ్నించినందుకే ఈ చర్యలు తీసుకొన్నట్లు ప్రచారం కూడా జరిగింది. ఇక ఈ ఏడాది ప్రారంభంలో క్లౌడ్ విభాగంలో సిబ్బందిని గణనీయంగా తగ్గించింది. తమ వ్యాపారానికి కీలక విభాగాలకు దృష్టిసారించాల్సిన అవసరం ఉందని నాడు గూగుల్ పేర్కొంది. గ్లోబల్ బిజినెస్, ప్లాట్‌ఫామ్స్ అండ్ డివైజెస్ డివిజన్‌లో కూడా తన సిబ్బందిని తగ్గించుకుంది. ఇక 2025 ప్రారంభంలో మానవ వనరుల విభాగం, హార్డ్‌వేర్, సెర్చ్, యాడ్స్, మార్కెటింగ్, ఫైనాన్స్, కామర్స్ విభాగాల ఉద్యోగులకు వాలంటరీ ఎగ్జిట్ ప్యాకేజీని ప్రకటించింది.

## మిడిల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి

గూగుల్ మేనేజ్‌మెంట్‌లోని వరుస క్రమాన్ని బాగా తగ్గిస్తోంది. మూడోవంతు మధ్యస్థాయి మేనేజర్లను తొలగించింది. చిన్న టీంలను పర్యవేక్షించేవారు ఈ జాబితాలో ఉన్నారు. నిర్ణయాలు వేగంగా తీసుకోవడం, కార్యకలాపాలను ఓ దారిలోకి తీసుకురావడానికి ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. 2024 డిసెంబర్ నాటికి లేఆఫ్‌ల తర్వాత 1,83,323 మంది ఉద్యోగులు ఈ సంస్థలో పనిచేస్తున్నారు.



రేవంతన్న కు శ్రీరామ నవమి పండగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం




ధర్మాన్ని కాపాడేందుకు జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత ప్రజా పాలకుడు శ్రీరాముడు. ఆ సీతారాముల అనుగ్రహం, చల్లని దీవెనలు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షిస్తూ..

మీకు మీ ఇంటిల్లి పాది అందరికీ శ్రీరామనవమి పండుగ శుభాకాంక్షలు..

మీ.

శ్రీమతి చింతల నిర్మల గోవర్ధన్ రెడ్డి గారు.

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మహిళ వైస్ ప్రెసిడెంట్









## రాష్ట్ర ప్రజలందరికీ శ్రీరామ నవమి పండుగ శుభాకాంక్షలు..

శ్రీరాముని ఆశీస్సులతో మీ ఇంట సుఖసంతోషాలు,ఆరోగ్య,ఐశ్వర్యాలు వెల్లివిరియాలని కోరుకుంటూ,మీకు మరియు మీ కుటుంబ సభ్యులకు శ్రీరామనవమి శుభాకాంక్షలు..

సీతారాముల కళ్యాణం మీ జీవితంలో నూతన ఉత్తేజాన్ని, సానుకూలతను నింపాలని ఆకాంక్షిస్తున్నాను...

మీ..కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,రాష్ట్ర మంత్రివర్యులు

















# పాలకుర్తిలో ఇంటిగ్రేటెడ్ రూరల్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహణ..




అన్వేషనేత్రం ప్రతినిధి

పాలకుర్తి శాసన సభ్యురాలు శ్రీమతి యశస్విని రెడ్డి గారి ఆదేశానుసారం, పాలకుర్తి మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ రూరల్ మరియు అర్బన్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి ఝాన్సి రాజేందర్ రెడ్డి గారు (Xలాజ) ఇన్స్టిట్యూషన్ సిస్టమ్స్ ప్లానింగ్ సెంటర్, న్యూ ఢిల్లీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు..ఈ కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గంలోని కొడకండ్ల గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు. గ్రామీణ మరియు పట్టణ అభివృద్ధిని సమన్వయం చేస్తూ సమగ్ర అభివృద్ధి సాధించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు..కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు, మహిళా సంఘాల బలోపేతం, యువతకు నైపుణ్యాభివృద్ధి, వ్యవసాయ రంగానికి మద్దతు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. అలాగే గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసి, అమలు చేయడంపై దిశానిర్దేశం చేశారు..ఈ సందర్భంగా ఝాన్సి రెడ్డి గారు మాట్లాడుతూ, పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ఇలాంటి సమగ్ర కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామాల నుంచి పట్టణాల వరకు సమాన అభివృద్ధి సాధించేందుకు ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు..పాల్గొన్న సర్పంచులు తమ గ్రామాల అభివృద్ధికి ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. అధికారులు కూడా అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు..

# కొడకండ్లలో మినీ టెక్స్టైల్ పార్క్‌పై అసెంబ్లీలో ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి గారి గళం.!!



అసెంబ్లీ సమావేశాల్లో పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి గారు కొడకండ్ల ప్రాంత అభివృద్ధికి కీలకమైన మినీ టెక్స్టైల్ పార్క్ ఏర్పాటుపై ప్రస్తావించారు. ఈ సందర్భంగా దేవరుప్పుల మండలం మరియు కొడకండ్ల మండలంలో ఉన్న చేనేత కార్మికుల పరిస్థితులను కూడా ఆమె సభ దృష్టికి తీసుకువచ్చారు. చేనేత రంగానికి ప్రోత్సాహం, ఉపాధి అవకాశాల పెంపు మరియు స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం కోసం తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

# కుటుంబ సభ్యులను పరామర్శించారు..

దేవరుప్పుల మండలం గోల్లపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆకవరం నర్సింహ రెడ్డి గారు నిన్న మృతిచెందిన నేపథ్యంలో, ఈరోజు టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి ఝాన్సి రాజేందర్ రెడ్డి గారు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు..ఈ



సందర్భంగా వారు ఆకవరం నర్సింహ రెడ్డి గారి మరణంపై గాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన గ్రామ అభివృద్ధికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు..ఝాన్సి రెడ్డి వారి వెంట.. మండల నాయకులు, గ్రామస్థులు, పార్టీ నాయకులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై ఆకవరం నర్సింహ రెడ్డి గారికి నివాళులు అర్పించారు..



# బడ్జెట్ కేటాయింపుల్లో గిరిజనులకు తీవ్ర అన్యాయం -జిపిఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు వడిత్యా శంకర్ నాయక్..!



హైదరాబాద్:అన్వేషనేత్రం ప్రతినిధి

తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో గిరిజన ప్రజా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రమావత్ దినేష్ నాయక్ అధ్యక్షతన ముఖ్యమైన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గిరిజన ప్రజా సమాఖ్య వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు వడిత్య శంకర్ నాయక్ గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వడిత్య శంకర్ నాయక్ మాట్లాడుతూ ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో గిరిజనులకు బడ్జెట్ కేటాయింపులో తీవ్ర అన్యాయం చేశారని అన్నారు.అదేవిధంగా గిరిజనుల హక్కులు, అభివృద్ధి కోసం కీలక డిమాండ్లు చేశారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఎస్సీ-ఎస్టీ కమిషన్‌ను కలిపి నిర్వహించకుండా, గిరిజనుల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేకంగా ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. దీని ద్వారా గిరిజనులకు న్యాయం జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్లేన్ ఏరియాల్లో నివసిస్తున్న గిరిజనులకు, జిల్లాలను యూనిట్‌గా పరిగణించి రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని సూచించారు. దీని వల్ల గిరిజనులకు రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం సరైన విధంగా కేటాయించి వినియోగించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏప్రిల్ 19న హైదరాబాద్ కేంద్రంగా రాష్ట్ర ముఖ్య సమావేశం ముఖ్య కార్యక్రమం నిర్వహించును.గిరిజన హక్కుల సాధన కోసం పోరాటం కొనసాగుతుంది అని నాయకులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమానికి గిరిజన ప్రజాపతినిధులు అతిథులు మేధావులు కళాకారులు విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య కార్యదర్శి జటావత్ సంతోష్ నాయక్, జీవీఎస్ రాష్ట్ర కార్యదర్శి ధీరావత్ రమేష్ నాయక్, జిపిఎస్ నాయకులు మూడవత్ దీప్లా నాయక్, కాట్రో భాను ప్రసాద్ నాయక్, వాంకుడోత్ గణేష్ నాయక్, బనావత్ సతీష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.









# ఘనంగా గుజరాత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు జన్మదిన వేడుకలు






హైదరాబాద్,అన్వేషనేత్రం మార్చి 26:

గుజరాత్ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదల్ అధ్యక్షురాలు ప్రగతి ఆహిర్ జన్మదిన వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి.ఈ సందర్భంగా కాంగ్రెస్ సేవాదళ్ సూర్యాపేట జిల్లా మహిళా అధ్యక్షురాలు కేతిరెడ్డి శకుంతల రెడ్డి.. ప్రగతి ఆహిర్ పుట్టినరోజు వేడుకలు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఇలాంటి వేడుకలు మరెన్నో జరుపుకోవాలని భవిష్యత్తులో రాజకీయంగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## మునుగోడులో అత్యాధునిక సాంకేతికత కలిగిన మినీ మొబైల్ హాస్పిటలిని వినియోగంలోకి తెచ్చిన్న రాజన్న..

# ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



పాలక వీడు:-మార్చి 26 అన్వేషనేత్రం

పాలకవీడు మండలంలో బొత్తలపాలెం గ్రామంలోని పీఎంశ్రీ ఎంపీపీస్ బొత్తలపాలెం పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థు లు అధికారులుగా, ఉపాధ్యాయులుగా, కలెక్టర్ గా టంగుటూరి భవ్యశ్రీ, జిల్లా విద్యాశాఖ అధికారిగా కడప అవంతిక, ఎంపీపీగా పోతుగంటి యామిని, ఎంపీడీఓ గా పాలకట్ల వర్షిత, మార్తా సాయిరాం, ఎమ్మార్వో గా నాగేల్లి జగన్, పోతుగంటి మను, మండల విద్యాశాఖ అధికారిగా బొమ్మకంటి మహాలక్ష్మి, ప్రధానోపాధ్యాయులుగా షేక్ సన, పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా తమ యొక్క ప్రతిభను ప్రదర్శించి చాలా చక్కగా విద్యార్థులకు పాఠాలు చెప్పారు. ఈ కార్యక్రమం వలన పిల్లలు లో వున్నా నీగుడమైన శక్తి బయటకు వస్తుందని, విద్యార్థులు తమ భవిష్యత్ లో ముందుకు వెళ్ళడానికి,మంచి స్థాయికి వెళ్ళడానికి ఇప్పుడు వారు చేసే రోల్ అనేది చాలా ఉపయోగపడుతుంది అని ప్రధానోపాధ్యాయులు ప్రగడ శేఖర్ అన్నారు.

# బొమ్మగాని ధర్మ బిక్షం 15వ వర్ధంతి వేడుకలు



నేరేడుచర్ల:-మార్చి 26 అన్వేషనేత్రం

సూర్యాపేట జిల్లాకు తెలంగాణ సాయుధ పోరాట యోధులు మాజీ శాసనసభ్యులు, మాజీ పార్లమెంటు సభ్యులు బొమ్మగాని ధర్మబిక్షం పేరు పెట్టాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు డిమాండ్ చేశారు గురువారం నాడు సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల ప్రధాన కూడలిలో దివంగత నేత బొమ్మగాని ధర్మబిక్షం చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం అలాగే ఆ తరువాత జరిగిన ప్రపంచ ప్రఖ్యాత తెలంగాణ రైతాంగ పోరాటం లో పాల్గొని అసమాన పోరాటాల ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిలిచిన ధీరుడు అని అట్టడుగు వర్గాల కుటుంబాల పిల్లలు చదువుకోవాలనే ఆకాంక్షతో సూర్యాపేట కేంద్రంగా ప్రత్యేక హాస్టల్ ఏర్పాటు చేసి దాతల నుంచి విరాళాలు సేకరించి అట్టి సొమ్మును పేద కుటుంబాల పిల్లల చదువు కోసం వినియోగించి ఎందరినో గొప్ప వ్యక్తులుగా శక్తులుగా తీర్చిదిద్ది తన యావత్ జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేసి మూడుసార్లు శాసనసభ్యుడిగా రెండుసార్లు పార్లమెంటు సభ్యుడిగా గెలిచినప్పటికీ చిల్లిగవ్వ ఆస్తి సంపాధించకుండా నిరాడంబ జీవితం గడిపిన బొమ్మగాని ధర్మభిక్షం పేరు సూర్యాపేట జిల్లాకు పెట్టడం ఎంతైనా సముచితంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు కార్యక్రమంలో కత్తి శ్రీనివాసరెడ్డి ముళ్ళ జానయ్య చిలకరాజు శ్రీను కొమర్రాజు వెంకట్, కొప్పు లక్ష్మీనారాయణ బీసీ సంఘం నాయకులు ముత్యాల భాస్కర్ బుడిగే చంద్రయ్య గౌడ్ చామకూరి వీరయ్య గౌడ్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ దొంతగాని వెంకటేశ్వర్లు గౌడ్ బండి శ్రీనివాస్ అనిల్ కొండ రాము గౌడ్ కిషన్ పాల్గొన్నారు.

# అతివేగంగా వాహనాలు నడపవద్దు

## సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నేరేడు చర్లఏ రవీందర్



నేరేడుచర్ల:-మార్చి 26 అన్వేషనేత్రం

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నేరేడుచర్ల మండల కేంద్రంలో ఆటో స్టాండ్ వద్ద అరైవ్ ఆలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించి ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి డ్రైవర్లకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవీందర్ మాట్లాడుతూ రోడ్డు ప్రయాణ సమయంలో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారానే ప్రమాదాలు నివారించవచ్చునని తెలిపారు. రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ బాధ్యతగా నడుచుకోవాలని రోడ్డు నియమ నిబంధనలను పాటించాలని కోరారు. ఇతర వాహనాలను ఓవర్ టేక్ చేసేటప్పుడు జాగ్రత్తగా వెళ్ళాలి, అతి వేగంగా వాహనాలు నడపవద్దు అని కోరారు.

# నవజాత శిశువును ప్రభుత్వానికి దత్తత



నేరేడుచర్ల : మార్చి 26 అన్వేషనేత్రం

నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవం అయిన ఇరుగు మనిత భర్త నాగరాజు గ్రామం పాలకవీడు (4) వ ఆడ బిడ్డకు జన్మను ఇచ్చింది ( గతం లో మూడు ప్రసవాలు ఆడ బిడ్డలే) వీరు రోజువారి కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారూ వారి ఆర్థిక స్థితి సరిగా లేని కారణంగా 4వ బిడ్డను సాకటం కష్టం అని భావించి ఇష్టపూర్వకంగా ఎవరి ఒత్తిడి లేకుండా వారికి పుట్టిన నవజాత శిశువును గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర నాగిని ఆధ్వర్యంలో ప్రభుత్వం వారికి బాలిక సంరక్షణ కొరకు దత్తత ఇచ్చారు.ఈ కార్యక్రమం లో జిల్లా వైద్యాధికారి డా. వెంకట రమణ ఉప జిల్లా వైద్యాధికారి డా. చంద్ర శేఖర్,ప్రోగ్రాం అధికారి డా. నజియా తదితరులు పాల్గొన్నారు.

# ఆహ్వానం

గౌరవ ఎమ్మెల్యే బాలునాయక్ గారు మన బంజారా భవన్ ప్రహరీ గోడ శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేయుచున్నారు.

తేదీ: 27-03-2026 (శుక్రవారం)

సమయం: ఉదయం 10:00 గంటలకు

కాబట్టి మన మండల పరిధిలో ఉన్న బంజారా సోదరులు, బంజారా నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, యువత, ఉద్యోగస్తులు మరియు పత్రిక మిత్రులు ప్రతి ఒక్కరూ తప్పక హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మనస్పూర్తిగా కోరుతున్నాము.

ముఖ్య గమనిక:
ఇదే ఆహ్వానంగా భావించి ప్రతి ఒక్కరూ తప్పక హాజరు కావలసిందిగా మనవి.

ఇట్లు,
రామావత్ లాలు నాయక్
బంజారా సేవా సంఘం కొండమల్లేపల్లి మండల అధ్యక్షులు




# సమిష్టి కృషితో మిర్యాలగూడ మున్సిపాలిటీ అభివృద్ధి చేద్దాం

## మొదటి బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి





మిర్యాలగూడ,అన్వేషనేత్రం మార్చి 26:

మిర్యాలగూడ మున్సిపాలిటీ అభివృద్ధికి అధికారులు



పాలకవర్గం సమన్వయ కృషితో పనిచేయాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు.గురువారం మున్సిపల్ కార్యాలయం నందు మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన పురపాలక సంఘం మొదటి బడ్జెట్ సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మైసమ్మ తల్లి దేవాలయం దర్శించుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన మున్సిపాలిటీ కౌన్సిల్ ఏర్పాటు అయిన తర్వాత ఏర్పాటు చేసిన మొదటి బడ్జెట్ సమావేశం కావున కౌన్సిలర్స్ అందరూ పార్టీలకు రాజకీయాలకు అతీతంగా పట్టణ అభివృద్ధిలో భాగస్వాములు అవ్వాలని పిలుపునిచ్చారు.విమర్శలకు, విబేధాలకి తావులేకుండా సామరస్యంగా అందరూ కలిసి పనిచేయాలి అని అన్నారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పురపాలక సంఘ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, అభివృద్ధికి అనుగుణంగా ముందుకెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్,కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అత్యాధునిక పిఓఇఎం విధానంతో అరుదైన క్యాన్సర్ వ్యాధి బాధితులకు ఉపశమనం.. డాక్టర్ వంశీకృష్ణారెడ్డి

మిర్యాలగూడ,అన్వేషనేత్రం,మార్చి 26:



అత్యాధునిక కేన్సర్ వైద్య సేవలతో క్లిష్టమైన ఏపీఎంఎల్ కేసును విజయవంతంగా నిర్వహించిన మలక్ పేట్, యశోద హాస్పిటల్స్ వైద్య బృందం. ఈ సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలో గురువారం మీడియా సమావేశంలో డాక్టర్ వంశీకృష్ణ రెడ్డి మాట్లాడుతూ అక్యూట్ ప్రోమైలోసిటిక్ లుకేమియా అనేది అరుదైన కానీ అత్యంత ప్రమాదకరమైన రక్త క్యాన్సర్. దీనిని సకాలంలో గుర్తించి తక్షణమే చికిత్స ప్రారంభించకపోతే తీవ్రమైన రక్తస్రావాలు, సంక్రమణలు,అవయవ వైఫల్యం వంటి ప్రాణాంతక సమస్యలు ఏర్పడే అవకాశం ఉంటుంది. ఆధునిక ఆంకాలజీ, హీమటాలజీ చికిత్సలతో, ప్రోటోకాల్ ఆధారిత కెమోథెరపీ ద్వారా ఈ వ్యాధిలో జీవనావకాశాలు గణనీయంగా మెరుగుపడుతున్నాయి. ఇటీవల, యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు, ఏపీఎంఎల్‌తో బాధపడుతున్న ఓ యువ రోగిని సమయానికి ఇండక్షన్, కన్సాలిడేషన్ కెమోథెరపీతో పాటు సమగ్ర సహాయక చికిత్సల ద్వారా విజయవంతంగా చికిత్స చేశారని తెలిపారు.కేసు వివరాలు:నల్గొండ జిల్లాకు చెందిన 20 ఏళ్ల యువకుడు జ్వరం, పళ్ళ దంతాల నుంచి రక్తస్రావం, తలనిర్బంధం మరియు శరీరంపై రక్తస్రావ మచ్చలతో యశోద హాస్పిటల్‌కు చేరాడు. పరీక్షల్లో తీవ్ర ప్లేట్లెట్ లోపం, రక్త సంబంధిత అసమానతలు గుర్తించబడ్డాయి. మరింత పరిశీలనలతో అతడికి అక్యూట్ ప్రోమైలోసిటిక్ లుకేమియా నిర్ధారణ అయ్యింది. రోగికి, ఆర్సెనిక్ ఆధారిత ఇండక్షన్ కెమోథెరపీ అందించడంతో పాటు, పీఆర్‌బీసీ, ప్లేట్లెట్ ట్రాన్స్‌ఫ్యూషన్లు, క్రయోప్రెసిపిటేట్, యాంటీబయోటిక్స్, యాంటీఫంగల్స్, నిరంతర వైద్య పర్యవేక్షణ అందించారు. నేత్ర, న్యూరో, ఈఎన్‌టీ నిపుణుల సూచనలతో బహుశాఖల వైద్య బృందం సమన్వయంతో చికిత్స అందించారు. తదుపరి దశలో రోగికి కన్సాలిడేషన్ కెమోథెరపీ నిర్వహించారు.చికిత్స కాలంలో రోగిని నిరంతరం ల్యాబ్ పరీక్షలు, అవసరమైన స్కానింగ్ ద్వారా పర్యవేక్షించారు.యశోద హాస్పిటల్స్ క్లిష్టమైన రక్త క్యాన్సర్ కేసులను సమర్థవంతంగా నిర్వహించగల సామర్థ్యాన్ని మరోసారి నిరూపించాయి. ఆధునిక చికిత్సలు, అనుభవజ్ఞులైన వైద్యులు,24/7 ఐసీయూ సదుపాయాలతో యశోద హాస్పిటల్స్ కేన్సర్ చికిత్సా విభాగంలో అత్యున్నతమైన ప్రమాణాలను నెలకొల్పుతోంది.యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మలక్‌పేట్, హైదరాబాద్ డైరెక్టర్ గౌరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర తెలిపారు. యశోద హాస్పిటల్స్ అన్ని బ్రాంచీల్లో అత్యాధునిక కేన్సర్ చికిత్స సదుపాయాలు, నిపుణులైన వైద్య బృందాలు అందుబాటులో ఉండి, అత్యవసర రక్త క్యాన్సర్ కేసులకు అత్యంత సమర్ధవంతమైన చికిత్సను అందించగలమని యశోదా ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది.మరిన్ని వివరాలకోసం – ఎ. వాసుకిరణ్ రెడ్డి -- 97057 71230 / 99499 98378 సంప్రదించాలని మీడియా ద్వారా తెలిపారు.

# నకిలీ బియ్యం బ్రాండ్లను ముద్రిస్తూ ఇతర రాష్ట్రాలకు సప్లై

## వ్యాపారీ నివాసం,గోదాంలో... ఢిల్లీ హైకోర్టు బృందం విస్తృత తనిఖీలు

మిర్యాలగూడ,అన్వేషనేత్రం మార్చి 26:





నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన ప్రముఖ బియ్యం వ్యాపారి చీదర్ల గోపి కి చెందిన నివాసం, కార్యాలయాల్లో గురువారం ఢిల్లీ హైకోర్టు అడ్వకేట్ జనరల్ ప్రతినిధులు విస్తృత తనిఖీలు నిర్వహించారు.పలు రకాల బియ్యం బ్రాండ్లను నకిలీవి ముద్రించి ఏలాంటి అనుమతులు లేకుండా దేశంలోని వివిధ రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నట్లుగా ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. కర్ణాటక తమిళనాడు, తెలంగాణకు చెందిన పలువురు బ్రాండెడ్ వ్యాపారులు ఢిల్లీ హైకోర్టులో ఫిర్యాదులు చేశారు.దీనిపై విచారణ ప్రారంభించిన హైకోర్టు ప్రత్యేకంగా అడ్వకేట్ జనరల్ లను నియమించి తనిఖీలకు ఆదేశించారు.ఢిల్లీ హైకోర్టు నుంచి వచ్చిన బృందం ప్రతినిధులు గురువారం ఒకటో పట్టణ సీఐ నాగభూషణ్ రావు ను కలిసి పోలీసుల ఎస్కార్ట్ సహాయంతో తనిఖీలు చేపట్టారు.పట్టణంలోని బ్లూవేల్ ప్యాలెస్ తో పాటు రెడ్డి కాలనీలో ఆయన నివాసం,ఆయన వ్యాపార సంస్థల్లో తనిఖీలు చేశారు. పట్టణంలోని ఎఫ్సీఐ సమీపంలో బస్తాలు ముద్రిస్తున్న పరిశ్రమలో విస్తృతంగా తనిఖీలు చేసి పలు బ్రాండ్లకు సంబంధించిన బస్తాలను వారు స్వాధీనం చేసుకున్నారు. పిడుగురాళ్లలోని మరో బస్తాల ముద్రించే కేంద్రంలో ప్రధానంగా మిర్యాలగూడకు చెందిన బ్రాండ్లను ముద్రిస్తున్నట్లు వారు గుర్తించారు.బియ్యం వ్యాపారిపై తనిఖీల విషయం పట్టణంలో బియ్యం వ్యాపారంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

అన్వేషనేత్రం
RNI.No. TELTEL/2010/32434
ఎడిటర్: గొల్ల రమేష్
తెలుగు దినపత్రిక

# ఆట



# దక్షిణాఫ్రికాపర్యటనకు టీమిండియా మహిళా జట్టు ప్రకటన


త్వరలో దక్షిణాఫ్రికాలో భారత మహిళల జట్టు పర్యటించనుంది. ఈ పర్యటనలో ఆతిథ్య దక్షిణాఫ్రికాతో భారత మహిళలు 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనున్నారు. ఏప్రిల్ 17న ఈ సిరీస్ ప్రారంభం కానుంది. కాగా.. ఈ సిరీస్‌లో పాల్గొనే భారత మహిళా జట్టును బీసీసీఐ ప్రకటించింది.ఇక 15 మంది సభ్యులు గల బృందానికి హర్మన్ ప్రీత్ కౌర్ నాయకత్వం వహించనుంది. వైస్ కెప్టెన్‌గా స్మృతి మంధాన వ్యహరించనుంది. ఆల్‌రౌండర్ అనుష్క శర్మకు తొలిసారి జాతీయ జట్టులో చోటు దక్కింది. అలాగే కాష్వీ గౌతమ్ టీ20 అరంగ్రేటానికి సిద్ధమైంది. ఇటీవల ఆసీస్‌తో సిరీస్‌కు ఎంపికైన వైష్ణవి శర్మ, స్నేహ్ రాణా, జి.కమలినీ, అమన్‌జోత్ కౌర్‌లకు దక్షిణాఫ్రికాతో సిరీస్‌కు చోటు దక్కలేదు.



# తిలక్ వర్మ ముంబై ఇండియన్స్ పెద్ద దిక్కు

## టీమిండియా వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్

ఐపీఎల్ చరిత్రలో ఐదు టైటిల్స్ నెగ్గిన తొలి జట్టు ముంబై ఇండియన్స్ ). తొలి ఐదేళ్లలో ఒక్క టైటిల్ కూడా నెగ్గని ముంబై.. 2013లో తొలిసారి ఛాంపియన్‌గా నిలిచింది. ఆ తర్వాత 2015, 2017, 2019, 2020లలో మరో నాలుగు టైటిల్స్ నెగ్గింది. ఈ ఐదు టైటిల్స్ కూడా రోహిత్ శర్మ కెప్టెన్సీలోనే రావడం విశేషం. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ సమీపిస్తున్న తరుణంలో జట్ల బలాబలాలు, ఆటగాళ్ల ప్రదర్శనపై విశ్లేషణలు ఊపందుకున్నాయి. ఈ క్రమంలో టీమిండియా వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ముంబై ఇండియన్స్ జట్టు గురించి చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముంబై జట్టులో రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ వంటి దిగ్గజ బ్యాటర్లు ఉన్నప్పటికీ, రాబోయే సీజన్‌లో ఆ జట్టుకు అత్యుత్తమ బ్యాటర్‌గా మరో ప్లేయర్‌ను ఎంపిక చేశాడు. తన యూట్యూబ్ ఛానెల్‌లో ఐపీఎల్ 2026 అంచనాల గురించి మాట్లాడుతూ అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముంబై ఇండియన్స్ జట్టులో ఎంతోమంది మ్యాచ్ విన్నర్లు ఉన్నారని, కానీ తిలక్ వర్మ ఒక 'కంప్లీట్ ప్యాకేజీ' అని ఆయన కొనియాడారు. "చాలామంది రోహిత్ శర్మ విధ్వంసం గురించి లేదా సూర్యకుమార్ యాదవ్ 360 డిగ్రీల ఆట గురించి మాట్లాడుకుంటారు. కానీ నా దృష్టిలో ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ తరఫున అత్యధిక పరుగులు చేసే ఆటగాడిగా, అత్యంత ప్రభావవంతమైన బ్యాటర్‌గా తిలక్ వర్మ నిలుస్తాడు" అని అశ్విన్ పేర్కొన్నారు. తిలక్ వర్మ గత కొన్ని సీజన్ల నుండి ముంబై ఇండియన్స్ జట్టులో కీలక సభ్యుడిగా ఎదిగారు. ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఆడుతూ జట్టును ఆదుకోవడంలో తిలక్ చూపించే పరిణతి అద్భుతమని అశ్విన్ విశ్లేషించారు. ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ముంబై జట్టులో మిడిల్ ఆర్డర్‌కు తిలక్ వర్మ వెన్నెముకగా మారాడని, అతడి బ్యాటింగ్ శైలి జట్టుకు అవసరమైన సమతుల్యతను ఇస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ అద్భుతమైన ఆటగాళ్లు అనడంలో సందేహం లేదని, అయితే తిలక్ వర్మ ఇన్నింగ్స్‌ను నిర్మించే తీరు, అవసరమైనప్పుడు గేర్ మార్చి భారీ షాట్లు ఆడే సామర్థ్యం అతడిని ప్రత్యేకంగా నిలబెడతాయని అశ్విన్ వివరించారు. ముఖ్యంగా స్పిన్నర్లను ఎదుర్కోవడంలో తిలక్ వర్మకు ఉన్న పట్టు, మైదానం నలుమూలలా బంతిని తరలించే టెక్నిక్ అతడికి అదనపు బలాన్ని ఇస్తాయని పేర్కొన్నారు.



అన్వేషనేత్రం
RNI.No. TELTEL/2010/32434
ఎడిటర్: గొల్ల రమేష్
తెలుగు దినపత్రిక

# సినిమా
CINEMA



## శ్రీలీల ట్రాక్ చూసేందుకు

# మహిళల ఆసక్తి

### ఉస్తాద్ భగస్ సింగ్‌పై హరీష్ శంకర్

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కథానాయకుడిగా దర్శకుడు హరీశ్ శంకర్ తెరకెక్కించిన చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. తాజాగా దీని ప్రచారంలో భాగంగా హరీశ్ శంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సినిమాకు వస్తున్న స్పందనపై ఆయన మాట్లాడుతూ.. సెకండ్ హాఫ్‌లో వచ్చే శ్రీలీల ఎపిసోడ్ మహిళా ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోందని తెలిపారు. 'నిజం చెప్పాలంటే.. రెండో భాగంలో శ్రీలీల ట్రాక్ చూడటం కోసమే మహిళలు భారీగా థియేటర్లకు వస్తున్నారు. పవన్ కల్యాణ్‌ను రెండు గంటల పాటు అభిమానులు వారు కోరుకున్నవిధంగా చూసుకోదగ్గ చిత్రమిది. కుటుంబ ప్రేక్షకులందరూ కలిసి ఆస్వాదించేలా ఉంది. నేను ఈ చిత్రం విషయంలో చాలా సంతోషంగా ఉన్నాను' అని అన్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ మూవీలో పవన్‌కు జోడీగా శ్రీలీల, రాశీఖన్నా నటించగా.. పార్తీబన్ విలన్ పాత్రలో కనిపించారు.





# దురంధర్-2 కు రజనీకాంత్ ప్రశంసలు

తాజా బ్లాక్‌బస్టర్ 'ధురంధర్ 2'పై సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రశంసలు కురిపించారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సృష్టిస్తోన్న ప్రభంజనాన్ని చూసి.. ఆదిత్య ధర్ పనితీరును మెచ్చుకుంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆదిత్యను 'బాక్సాఫీస్ కా బాప్' అని ప్రశంసించడమే కాకుండా సినిమా అద్భుతంగా ఉందని రజనీకాంత్ కొనియాడారు. ఈ సందర్భంగా హీరో రణవీర్ సింగ్, చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. ప్రతి భారతీయుడు చూడాల్సిన సినిమా అని అన్నారు. రజనీకాంత్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తలైవా పోస్ట్‌కు ఆదిత్య ధర్ ఎమోషనల్ రిప్లై పెట్టారు. 'మేమందరం వినోదం అనే పదానికి మీ ఒక్కరినే బెంచ్‌మార్క్‌గా చూస్తూ పెరిగాము. దశాబ్దాలుగా మమ్మల్ని విజిల్స్ వేయించేలా, నవ్వించేలా, భావోద్వేగానికి గురయ్యేలా.. మీరు వినోదానికి అసలైన అర్థం చెప్పారు. ఇప్పటికీ అదే స్టైల్.. అదే గ్రేస్‌తో మీరు చేస్తున్న మ్యాజిక్ అద్భుతం.------

# ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన మోహన్‌లాల్

మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ తన వ్యక్తిత్వ హక్కుల రక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన అనుమతి లేకుండా తన పేరు, గొంతు, ఫోటోలు, సంతకం లేదా తన నటనకు సంబంధించిన ప్రత్యేకమైన హావభావాలను వాణిజ్య ప్రయోజనాల కోసం ఏ ఒక్కరూ వాడుకోకుండా చూడాలని ఆయన తన పిటిషన్‌లో కోరారు. ముఖ్యంగా ప్రస్తుత కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీని ఉపయోగించి తన రూపాన్ని మార్చడం , తన గొంతును అనుకరిస్తూ తప్పుడు ప్రకటనలు చేయడం వంటివి తన గౌరవానికి భంగం కలిగిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డిజిటల్ ఎ÷-లాట్‌ఫారమ్‌లు, అనామక వ్యక్తులు తన 'మోహన్ లాల్' అనే బ్రాండ్‌ను అక్రమంగా వాడుకోకుండా వెంటనే స్టే ఇవ్వాలని ఆయన న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. అయితే జస్టిస్ జ్యోతి సింగ్ నేతృత్వంలోని బెంచ్ ఈ పిటిషన్‌ను విచారించనుంది. గతంలో బాలీవుడ్ దిగ్గజాలు అమితాబ్ బచ్చన్, అనిల్ కపూర్, సోనాక్షి సిన్హాతో పాటు టాలీవుడ్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్ కూడా తమ ఇమేజ్ దుర్వినియోగం కాకుండా ఇదే తరహాలో ఢిల్లీ హైకోర్టు నుండి రక్షణ పొందిన విషయం తెలిసిందే. కోర్టు గనుక మోహన్ లాల్‌కు అనుకూలంగా తీర్పునిస్తే, ఆయన అనుమతి లేకుండా ఆయన బొమ్మలతో టీ-షర్టులు అమ్మడం, మీమ్స్‌లో వాణిజ్య ప్రకటనలు జోడించడం లేదా ఆయన గొంతుతో ంఎ వీడియోలు సృష్టించడం వంటివి చట్టరీత్యా నేరాలుగా పరిగణించబడతాయి. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'దృశ్యం 3' సినిమా కోసం అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.

Printed Published and owned by Golla Ramesh, No.8-4-111, NG. Colony, Ramagiri, Nalgonda-508001 Telangana State, Printed at Prabhu publication H.No.6-4-111. NC Colony Ramaghir, Nalgonda-508001 Telangana State Publisheds H.No.6-4-111. NG. Colony, Ramagiri, Netponde-508001 Telanagan Stsos, Editor T Golla RN.No. TELTEL/201002434